# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, సోమవారం 1 జూలై 2024 HYDERABAD





**సిటీబ్యూరో:** బొల్లారం రాష్ట్రపతి నిలయం వేదికగా సైక్లిస్టులతో ఆదివారం సైక్లాథాన్ ఉత్సాహంగా సాగింది. బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, వీఎస్ఎం ఎస్ఎం రాకేశ్, ఎన్ఎండీసీ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రియదర్శిని, రాష్ట్రపతి భవన్ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ స్వాతి షా.. జెండా ఊపి సైక్లాథాన్‌ను ప్రారంభించారు.



## శ్మశానాన్నీ వదల్లేదు..!

కబ్జాకు కాదేది అనర్హం... అన్నట్లు కొందరు ఏకంగా శ్మశానంలోనే కబ్జా చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ -20 పరిధిలోని కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బీ బ్లాక్‌లో హిందూ శ్మశాన వాటిక కోసం కేటాయించిన 1.5 ఎకరాల స్థలంలోని 500 గజాల్లో రాత్రికి రాత్రే రేకుల షెడ్‌ను నిర్మించారు. దీంతో కబ్జాను అడ్డుకునేందుకు స్థానికులు ఎమ్మెల్యే గాంధీ, మియాపూర్ పోలీసులు, శేరిలింగంపల్లి సర్కిల్ -20 అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

*-కొండాపూర్, జూన్ 30*

## నేడు జీహెచ్ఎంసీలో ప్రజావాణి

సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం(నేడు) ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. ప్రజావాణి సందర్భంగా ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు ఫోన్ ఇన్ ప్రోగ్రాం ఉంటుందని చెప్పారు. ప్రజలు 040-2322 2182 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించాలని పేర్కొన్నారు. జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తారని కమిషనర్ స్పష్టం చేశారు.

## 'విద్యుత్ నిర్వహణ అదానీకి వద్దు'

సైదాబాద్: పాతబస్తీ విద్యుత్ నిర్వహణను అదానీ కంపెనీకి ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలంటూ ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో సంతోష్‌నగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకులు ఈశ్వర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని తొమ్మిది విద్యుత్ సర్కిళ్లను మొదటి దశగా అదానీ కంపెనీకి అప్పగించాలని రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన ప్రకటన ద్వారా ప్రజలకు ప్రైవేటు కంపెనీలకు విద్యుత్ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలుస్తున్నదన్నారు.

# ఏఎంఆర్..గోల్‌మాల్

### పనిచేయని 1200 మీటర్లు.. జలమండలి ఆదాయానికి భారీ గండి

### అంతర్జాతీయ ప్రమాణాలంటూ చైనా ఉత్పత్తుల వినియోగం

### నాణ్యత లేని మీటర్లతో వినియోగదారులకు తప్పని తిప్పలు



సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ ) : జలమండలిలో నీటి దోపిడీ జరుగుతోందా? సంస్థ నెలవారీగా ఆదాయానికి భారీగా గండి పడుతుందా? ఇందుకు కొందరు అధికారులు ఏఎంఆర్ మీటర్లను కేంద్రంగా చేసుకున్నారా? అంటే బోర్డు వర్గాల నుంచి అవుననే సంకేతాలు వస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లోని ఒక అంగుళం, ఆపై పరిమాణం ఉన్న నల్లా కనెక్షన్లకు ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) విధానం జలమండలి అమలు చేస్తున్నది. సంస్థకు ప్రధాన ఆదాయ మార్గాలైన కంపెనీలు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు సంబంధించి ప్రతి నీటి బొట్టునూ పక్కాగా లెక్కించేందుకు ఏఎంఆర్ మీటర్లను అమర్చింది. సంస్థ పరిధిలో 12,200 ఏఎంఆర్ మీటర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో మీటరుకు సుమారు రూ.30వేలకు పైగా ఖర్చు చేశారు. అయితే చాలా చోట్ల ఏఎంఆర్ మీటర్ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదు. ఏజెన్సీల నుంచి వచ్చే కమీషన్లతో నాణ్యత లేని కంపెనీల మీటర్లను అధికారులు ఎం ప్యానల్ చేశారు. ఫలితంగా ప్రస్తుతం 1200 మీటర్లు పనిచేయడం లేదు. దీంతో సంస్థకు రెవెన్యూ నష్టం వాటిల్లుతున్నది. వాస్తవానికి ఏఎంఆర్ మీటర్లతో సంస్థకు నెలవారీగా రూ. 45 కోట్ల మేర ఆదాయం వస్తున్నది. కానీ వెంటిలేటర్‌లో ఉన్న ఈ ఏఎంఆర్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తే సంస్థకు అదనంగా 20 శాతం మేర ఆదాయం వస్తుందని స్వయంగా అధికారులే చెబుతుండటం గమనార్హం.

### చైనా మాల్‌తో దందా?

సంస్థ పరిధిలో 25 ఎంఎం, ఆపై నల్లా కనెక్షన్లకు ఏఎంఆర్ మీటర్ తప్పనిసరి. ఇందుకు సంస్థకు సంబంధించి మూడు ఏజెన్సీలకు ఈ ఏఎంఆర్ మీటర్ల బాధ్యతలు అప్పగించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఎంఆర్ మీటరింగ్ వ్యవస్థ పనిచేస్తుంది. వాడిన ప్రతి నీటి బొట్టుకు లెక్కించవచ్చు. రోజూ ఎంత నీరు ఇస్తున్నాం? అందుకు తగ్గ రెవెన్యూ వచ్చిందా? లేదా అన్నది రోజూ వారీగా చూసుకునే వీలు ఈ ఏఎంఆర్ మీటర్‌తో తెలుస్తుంది. కనెక్షన్ తీసుకునే సమయంలో వినియోగదారుడి నుంచి ఏఎంఆర్ మీటర్‌కి రూ. లక్షలు వసూలు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఈ మీటర్ల నిర్వహణలో మాత్రం సదరు ఏజెన్సీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఏఎంఆర్ మీటర్ తీసుకుంటే ఐదేండ్ల గ్యారంటీ అంటూ అంటగడుతున్నారు. ఏజెన్సీ నుంచి తీసుకున్న వినియోగదారుడికి మీటర్ పనిచేయక..ఏజెన్సీ చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం ఉండటం లేదు. పైగా మీటర్ రిపేరు అంటూ పెద్ద మొత్తంలో జలమండలి జారీ చేసిన బిల్లులపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న వినియోగదారుడు.. చివరకు పనులు మానుకొని నల్లా బిల్లుల సమస్యను పరిష్కరించుకోలేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అయితే ఏజెన్సీలు, కొందరు అధికారుల తీరుతో ఏఎంఆర్ వ్యవస్థ సక్రమంగా నిర్వహించలేక..ఇందులోనే చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏఎంఆర్ మీటర్లు నాణ్యతగా ఉండటం లేదు. ఎక్కువ శాతం చైనా ఉత్పత్తులను వినియోగిస్తుండడంతోనే ఈ మీటర్లు పనిచేయడం లేదు. మీటర్ రిపేర్ల కోసం ఎన్నిసార్లు ఫిర్యాదులు వెళ్తున్నా.. ఏజెన్సీల నుంచి కనీస స్పందన ఉండటం లేదని వినియోగదారులు మండిపడుతున్నారు. సదరు ఏజెన్సీలపై నామమాత్రంగా నోటీసులు ఇస్తూ చర్యల విషయంలో వెనుకంజ వేయడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ శాఖ తరహాలో క్వాలిటీ మీటర్ రీడింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

# కంటోన్మెంట్‌కు మంచిరోజులు..!

### బల్దియాలో విలీనానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

### తప్పనున్న ట్రాఫిక్ తిప్పలు.. కొలిక్కి రానున్న సమస్యలు

సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ ) : కంటోన్మెంట్ వాసుల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పోరాటం ఎట్టకేలకు ఫలించింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిలియన్ ప్రాంతాలను బల్దియాలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ వేగవంతం కావడంతో కంటోన్మెంట్ వాసులకు మంచిరోజులు వచ్చినట్లే. ఎన్నో ఏండ్లుగా నగరం నడిబొడ్డున ఉన్నా.. ఆంక్షల నేపథ్యంలోనే జీవితాలు కొనసాగాయి. ఇండ్లు నిర్మించుకోవాలన్నా, పలు మార్గాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక కంటోన్మెంట్ విలీనం అయితే సమస్యలన్నింటికీ పరిష్కారం దొరికినట్లే.




**ఫలించిన కేటీఆర్ పోరాటం:** ఇప్పటివరకు కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న అన్ని రకాల ఆస్తులను బల్దియాకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. అదేవిధంగా ఉన్న అప్పులను కూడా తీర్చే బాధ్యత బల్దియానే తీసుకోనున్నది. కాగా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని చాలా కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. అప్పటి మంత్రి కేటీఆర్ ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంతో అవిశ్రాంతంగా పోరాటం చేస్తూ వచ్చారు. ఇంత కాలానికి ఆయన పోరాటం ఫలించింది.

**అభివృద్ధి పనులకు:** రోడ్ల విస్తరణ,ఫ్లై ఓవర్ల నిర్మాణం, జాతీయ రహదారి రూపకల్పన తదితర అభివృద్ధి పనులకు కంటోన్మెంట్ పరిధిలోని భూములు కీలకంగా ఉన్నాయని, ఇవన్నీ రక్షణ శాఖ పరిధిలో ఉన్నందున అనుమతులు రాకపోవడంతో అభివృద్ధి ప్రతిపాదనలకు ఇబ్బందికరంగా మారిందంటూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేంద్ర ప్రభుత్వానికి రాతపూర్వకంగానే విజ్ఞప్తి చేసింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్ అనేకసార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. ఈ భూములను బల్దియాకు అప్పగించాలని, ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి ఇస్తామని రక్షణ శాఖకు హామీ ఇచ్చారు. కాగా, కేంద్రం బల్దియాలో విలీనానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కంటోన్మెంట్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ట్రాఫిక్ సమస్యలకు చెక్:** సుమారు 3 వేల ఎకరాల మేర (27.5%) భూములు జీహెచ్ఎంసీకి రావడానికి అవకాశమున్నది. ఈ భూములు జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తే జాతీయ రహదారులతో పాటు రోడ్ల విస్తరణ, స్కై వే, ఫ్లై ఓవర్లు, సబ్ వేలు, రోడ్ అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు తదితరాలను నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి చిక్కులు తొలుగుతాయి. ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

**కేసీఆర్ చిత్తశుద్ధికి నిదర్శనం:** కంటోన్మెంట్ ప్రాంత విలీనం.. గత ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్తశుద్ధికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కంటోన్మెంట్ విలీనానికి ఎంతో కృషి చేసినట్లు ఎక్స్ ఖాతాలో వివరించింది. అప్పటి మంత్రి కేటీఆర్ చేసిన అవిశ్రాంత పోరాటాన్ని గుర్తు చేస్తూ బీఆర్ఎస్ స్పందించింది. రక్షణశాఖ మంత్రులు, రక్షణ శాఖ ఉన్నతాధికారులు, కేంద్ర మంత్రులకు రాసిన లేఖలు, కంటోన్మెంట్ ప్రజలందరికీ తెలుసని పేర్కొంది. కానీ ఒకరి శ్రమ ఫలితాన్ని తమ ఖాతాలో వేసుకునే పార్టీల కుసంస్కారం అందరికీ అర్థం అవుతున్నదంటూ.. కంటోన్మెంట్ ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ కేసీఆర్, కేటీఆర్ జరిపిన చర్చల ఫొటోలను నెటిజన్లతో బీఆర్ఎస్ పంచుకోగా, కేటీఆర్ రీ ట్వీట్ చేశారు. ఇదిలా ఉంటే కంటోన్మెంట్ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీలో విలీనానికి తొందరగా చర్యలు తీసుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

# హెచ్ఎండీఏలో గ్రోత్ కారిడార్ విలీనం

### ఇంజినీరింగ్ విభాగం అధికారులకు కొత్త బాధ్యతలు

### హెచ్‌జీసీఎల్ సీజీఎంకు సీఈగా అవకాశం

సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అత్యంత కీలకమైన విభాగాలుగా ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక (ప్లానింగ్) విభాగాల్లో సమూలంగా మార్పులు చేయనున్నట్లు తెలిసింది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులను చేపట్టడంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఇంజినీరింగ్ విభాగంలోని ఉన్నతాధికారుల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నది. అర్హత లేని వారికి అందలం కల్పించి, అర్హులను మాత్రం పనిలేని చోట నియమించడం వల్ల కొన్ని రోజులుగా అసంతృప్తి జ్వాల రాజుకుంటోంది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న అధికారిని ఆ బాధ్యతల నుంచి తప్పించి, ప్రస్తుతం హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సీజీఎంగా ఉన్న అధికారిని చీఫ్ ఇంజినీర్‌గా నియమించనున్నారని తెలుస్తోంది. ఉన్నతాధికారుల మధ్య హోదాల పరంగా ఉన్న తారతమ్యాలతో ఉద్యోగులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సంస్థాగతంగా ఇంజినీరింగ్ విభాగం ఒకప్పటిలా ఉన్నట్లు ఒక్కతాటిపై లేదు. రెండు వర్గాలుగా మారడంతో ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మన స్ఫూర్తిగా పనిచేయలేమని కొందరు ఉన్నతాధికారులు బహిరంగంగానే తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పూర్తి స్థాయి కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ రావడంతో ఒక్కో విభాగంపై పూర్తి స్థాయిలో సమీక్ష చేపడుతున్నారు. బాధ్యతలు తీసుకున్న రెండో రోజే గంటల తరబడి ఇంజినీరింగ్ విభాగం పనితీరుపైనే ఎక్కువ దృష్టి సారించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ పరిధిలో ఉన్నతాధికారులకు ఎలాంటి పనులు లేకపోవడంతో దాన్ని హెచ్ఎండీఏలో విలీనం చేయడం ద్వారా ఇంజినీరింగ్ విభాగంలో సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది.

### ప్లానింగ్ విభాగంలోనూ ప్రక్షాళన..

హెచ్ఎండీఏలో ప్లానింగ్ విభాగం అంటేనే అవినీతికి మారు పేరు అన్న ముద్ర ఉన్నది. అలాంటి విభాగంలోనూ మార్పు చేయనున్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. భవన నిర్మాణంతో పాటు లే అవుట్ల అనుమతుల విషయంలో ప్లానింగ్ విభాగంపై తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు వచ్చాయి. అధికారుల చుట్టూ తిరిగి, చెయ్యి తడిపితే తప్ప..ఫైల్ ముందుకు కదలదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్లానింగ్ విభాగంలోనూ ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే శంకర్‌పల్లి జోన్‌లో పనిచేసే అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు. అందులో భాగంగా హెచ్ఎండీఏ కమిషనర్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలపైనే ఎక్కువగా దృష్టి సారించి, ఉన్నత స్థాయి ఉద్యోగుల నుంచి కింది స్థాయి ఉద్యోగులతోనే చాలా సుదీర్ఘంగా మాట్లాడుతున్నారు. ఒక రోజు రాత్రి 8 గంటల వరకు ప్లానింగ్ విభాగం అధికారులతోనే సమావేశం నిర్వహించిన విషయాన్ని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. హెచ్ఎండీఏకు ప్రధాన ఆదాయ వనరు ప్లానింగ్ విభాగం కావడంతో దాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి అధికారుల్లో నెలకొన్న అసంతృప్తులను తొలగించి, సామర్థ్యం ఉన్న వారికి సముచిత స్థానాలు కల్పించే చర్యలు తీసుకోనున్నారు. గత ఆరునెలలుగా హెచ్ఎండీఏ పనితీరుపైనే సంస్థ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుసుకున్న కొత్త కమిషనర్.. దాన్ని పోగొట్టే దిశగా సరికొత్త నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

# హెచ్ఎండీఏ ప్లాట్స్.. ఫర్ సేల్..!

### విక్రయానికి లేమూర్, ఇన్ముల్‌నర్వ లే అవుట్లు సిద్ధం

### భూ సమీకరణ పథకంలో రెండు చోట్ల భారీ లే అవుట్లు

సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ): భూములను విక్రయించడం ద్వారా డబ్బులు రాబట్టాలని రేవంత్ సర్కారు చూస్తోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలోని భూములను విక్రయించేందుకు ఉన్న అవకాశాలపై ప్రధానంగా దృష్టి సారించింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో భూ సమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీమ్) ద్వారా ప్రభుత్వ భూములు కాకుండా రైతులకు చెందిన పట్టా భూములను సేకరించి.. లే అవుట్లుగా అభివృద్ధి చేపట్టింది. ఇలా రంగారెడ్డి జిల్లా పరిధిలోని లేమూర్, ఇన్ముల్‌నర్వ ప్రాంతాలతో కలిపి సుమారు 200 ఎకరాల్లో హెచ్ఎండీఏ భారీ లే అవుట్లను అభివృద్ధి చేసింది. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. అయితే ఈ లే అవుట్లలో హెచ్ఎండీఏ వాటా కింద వచ్చే భూములను విక్రయించడం ద్వారా డబ్బులు రాబట్టాలని ప్రభుత్వం హెచ్ఎండీఏపై ఒత్తిడి పెంచింది. ఈ నేపథ్యంలోనే లేమూర్, ఇన్ముల్‌నర్వ హెచ్ఎండీఏ లే అవుట్లకు సంబంధించిన ప్రధాన గేట్ల వద్ద ఆర్చీలను త్వరగా నిర్మించి, అందులోని ప్లాట్లను విక్రయించేందుకు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తొందర పెడుతోంది. ఇక ప్రభుత్వమే ఆదేశించడంతో పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేపట్టకపోయినా విక్రయించేందుకు వేగంగా ఏర్పాట్లు చేయాల్సి వస్తోందని హెచ్ఎండీఏ అధికారులు వాపోతున్నారు.

### రూ. 61.78 లక్షలతో ఆర్చీల నిర్మాణం..

లేమూర్, ఇన్ముల్‌నర్వ ప్రాంతాల్లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లే అవుట్లకు ముఖ ద్వారాలను( ఆర్చీలు) నిర్మించేందుకు రూ. 61.78 లక్షలతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన పనులు వెంటనే చేపట్టేందుకు టెండర్లు సైతం ఇటీవలే పిలిచారు. పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపడితేనే లే అవుట్‌లో ప్లాట్ల విక్రయానికి అనుకూలంగా ఉంటుందనే ఆలోచనతో ప్రభుత్వం హెచ్ఎండీఏకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిసింది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో డిమాండ్ లేదని, ఇలాంటి సమయంలో ప్లాట్ల విక్రయాలు సరైన నిర్ణయం కాదని అధికారులు చెబుతున్నా.. వినిపించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

## డ్రగ్స్‌ను కనిపెట్టే స్నిఫర్ డాగ్స్..



స్నిఫర్ డాగ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు

జూబ్లీహిల్స్, జూన్ 30: డ్రగ్స్ గుట్టురట్టు చేసేందుకు జూబ్లీహిల్స్ పోలీసులు కొత్త వ్యూహాలకు తెరతీశారు. ఇకపై అనుమానిత ప్రదేశాల్లో స్నిఫర్ డాగ్స్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు పబ్‌లు, క్లబ్‌లలో పార్టీలు జరుగుతుండగానే నార్కోటిక్ ట్రైన్డ్ డాగ్స్‌తో తనిఖీలు చేపట్టనున్నారు. రహస్య ప్రదేశాలతో పాటు మనుషుల వద్ద కూడా డ్రగ్స్ వాసన కనిపెట్టేలా ఈ జాగిలాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శనివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని పలు పబ్స్‌లో జూబ్లీహిల్స్ పోలీసులు స్నిఫర్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఒక వైపు పార్టీలు జరుగుతుండగానే మరోవైపు ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సోదాల్లో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు రాకేశ్, గోవర్ధన్, హరీశ్వర్‌రెడ్డి, గోపీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పుస్తకాలు అందలె.. యూనిఫాంలు చేరలె

### హైదరాబాద్ విద్యాశాఖలో ఎందకింత నిర్లక్ష్యం..?

### అలసత్వం ప్రదర్శిస్తున్న జిల్లా విద్యాధికారులు

### నోటీసులు జారీ చేసినా మారని తీరు

### పదో తరగతి ఫలితాల్లోనూ వెనకబడిన జిల్లా



ఇటీవల గోల్కొండలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జూన్ 30 ( నమస్తే తెలంగాణ ) : బడులు ప్రారంభమై 18 రోజులు గడుస్తున్నాయి. ఇంకా పుస్తకాలు, యూనిఫాంల లోటు హైదరాబాద్‌ను వెంటాడుతున్నది. ఓ వైపు డీఈఓ విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫాంలు అందించామని చెబుతున్నారు. కానీ వాస్తవ రూపంలో మాత్రం కొన్ని స్కూళ్ల విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాంలు, పుస్తకాలు అందకపోవడం గమనార్హం. ఈ విషయం ఆకస్మిక పర్యటన చేసిన కలెక్టర్ దృష్టిలో వెలుగు చూసింది. ఏ ఒక్క విద్యార్థి బడికి దూరం కాకూడదని ప్రభుత్వాలు సకల సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తుంటాయి. కానీ వాటిని అమలు చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదే. అయితే హైదరాబాద్‌లో విద్యాధికారులు మాత్రం ఆ దిశగా పనిచేయడం లేదనేది స్పష్టంగా కనిపిస్తున్నది. మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలవాల్సిన హైదరాబాద్ విద్యారంగంలో ఏటా వెనకబడి అధ్వాన స్థితికి జారిపోతున్నది. విద్య, వసతులను మెరుగుపరుస్తూ..నాణ్యమైన బోధన అందుతుందా? లేదా? అనే విషయంపై దృష్టి సారించాల్సిన జిల్లా విద్యాధికారి ఆ దిశగా అడుగులు వేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అయినా.. తీరు మారలె..

జిల్లాలో విద్యాశాఖ సరిగా పనిచేయడం లేదని కలెక్టర్ ఏకంగా డీఈఓ రోహిణీకి నోటీసులు జారీ చేయడం ఇటీవల కలకలం రేపిన విషయం తెలిసిందే. అయినా విద్యాశాఖలో మార్పు రాలేదు. ఉన్నతాధికారులను హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదు. డీఈఓ పర్యవేక్షణ కరువై పాఠశాలల్లో విద్యార్థులు పుస్తకాలు, యూనిఫాంలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇటీవల గోల్కొండలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు అందలేదనే విషయాన్ని తెలుసుకున్నారు. దీంతో డిప్యూటీ డీఈఓ రమణా రాజు, డిప్యూటీ ఐఓఎస్ మాక్బుల్ అహ్మద్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వాజీద్ హస్మికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

### పది ఫలితం.. ఆగం..

జిల్లాలో మొత్తం 3వేలకు పైగా పాఠశాలలు ఉంటాయి. ప్రతి పాఠశాలలో వసతులు, బోధన, ప్రత్యేక కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షణ జిల్లా విద్యాధికారిదే. అనంతరం 24 మంది డీఐఓస్‌లు ఉంటారు. వారంతా పాఠశాలలపై దృష్టి సారించాలి. కానీ క్షేత్రస్థాయిలో వారంతా నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పదో తరగతి ఫలితాల్లో హైదరాబాద్ రాష్ట్రంలో 30వ స్థానానికి దిగజారింది. మిగిలిన జిల్లాలతో పోలిస్తే హైదరాబాద్‌లో పాఠశాలలు సకల వసతులతో నాణ్యమైన బోధన ఉండాలి. కానీ అవేం ఇక్కడ కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.